జూబ్లీహిల్స్ అభివృద్ధికి రూ.500 కోట్లు

రాష్ట్ర మంత్రి సీతక్క

బోరబండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే రూ.150 కోట్లు కేటాయించిందని, అవసరమైతే మరో రూ.500 కోట్లు కేటాయిస్తుందని రాష్ట్ర మంత్రి డా.సీతక్క తెలిపారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడమే కాకుండా వారిని యజమానులుగా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. బోరబండ డివిజన్ స్వరాజ్ నగర్‌లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్, కార్పొరేటర్ ఎం.డి. బాబా ఫసియుద్దీన్‌తో కలిసి గురువారం ఆమె ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీఎల్పీ మాజీ నేత పీజేఆర్ మరణానంతరం జరిగిన ఉప ఎన్నికలో అభ్యర్థిని బరిలోకి దింపినప్పుడు బీఆర్ఎస్ నాయకులకు సానుభూతి గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు ముఖ్వా విజయ్ బాబు, బండ్రు శోభారాణి, బోరబండ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.అశోక్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, రజీ, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.


ప్రచారంలో భాగంగా స్వరాజ్‌నగర్‌లో కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క


బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో నవీన్ యాదవ్

కాంగ్రెస్‌లో చేరిక

బోరబండ డివిజన్‌లో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. వివిధ బస్తీలకు చెందిన నాయకులు నవీన్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సాయిబాబానగర్ అధ్యక్షుడు ఎం.రమేష్ నాయక్, పెద్దమ్మనగర్ అధ్యక్షుడు వేముల వీరేశం, బంజారానగర్ అధ్యక్షుడు బండారి యాదయ్య, వీకర్ సెక్షన్, రాజ్‌నగర్, స్వరాజ్‌నగర్, వినాయకరావునగర్, సైట్-3, 4 కాలనీలు, ఎస్పార్టీనగర్ నుంచి ముఖ్య నాయకులు, మహిళా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా, ప్రచారంలో భాగంగా నల్లగొండ గద్దర్ నర్సన్న నవీన్ యాదవ్ పాటలు పాడి ప్రజలను ఆకట్టుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఎమ్మెల్యే భేటీ


రామకృష్ణారావుతో చర్చిస్తున్న శ్రీగణేశ్

సికింద్రాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ గురువారం భేటీ అయ్యారు. కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన టీపీటీ చార్జీల బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పలు బస్తీల ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి రక్షణ శాఖకు సంబంధించిన భూములకు బదులు భూములు ఇచ్చే అంశాన్ని సత్వరమే క్లియర్ చేయాలని ఆయన కోరారు. కాగా, త్వరలోనే భూముల బదలాయింపు గురించి తీపి కబురు అందుతుందని రామకృష్ణారావు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకే తాను ప్రధాన కార్యదర్శితో భేటీ అయ్యానని శ్రీగణేశ్ చెప్పారు.

24 మద్యం దుకాణాలకు రూ.30 కోట్ల 27 లక్షల ఆదాయం

- 26న మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీ
- ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్


పటేల్ బానోత్

అమీర్‌పేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 24 మద్యం దుకాణాలకు గురువారం సాయంత్రం 7 గంటల వరకు 1,009 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా రూ.30 కోట్ల 27 లక్షల ఆదాయం ప్రభుత్వానికి వచ్చినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్ తెలిపారు. ఈనెల 23తో దరఖాస్తుల స్వీకరణ పూర్తయిందని, 27న టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బంజారాహిల్స్‌లో 6, అమీర్‌పేట 9, జూబ్లీహిల్స్‌లో 9 మద్యం దుకాణాలు ఉన్నాయని తెలిపారు. 27న బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10లోని బాబు జగ్జీవన్ రామ్ బీసీ భవన్‌లో డ్రా తీసి లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.


జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం చేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు
ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి


రహ్మత్ నగర్‌లో ప్రచారం చేస్తున్న చామకూర మల్లారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్


వెంగళరావునగర్‌లో కూరగాయలు అమ్ముతూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్

బోరబండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్‌ను గెలిపించాలని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం బోరబండలో వారు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాగంటి పేదల కోసం ప్రతీ నిత్యం పనిచేశారని గుర్తు చేశారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందించడమే కాకుండా తన వంతుగా బహుమతులు అందజేసి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మాగంటి సునీత మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలని మాగంటి తపించిపోయేవారని, ఆయన ఆశయ సాధన కోసమే తాను రాజకీయాల్లో వచ్చానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్యరావు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మాగంటి సునీత వెంగళరావునగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేశారు.


బీఎల్ఓలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

ఖైరతాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఎన్నికల అధికారి, సర్కిల్-18 ఉప కమిషనర్ వి.సమ్మయ్య ఆధ్వర్యంలో విధులు, ఫారాలను భర్తీ చేసే విషయమై అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళి, బూత్ స్థాయిలో వ్యవహరించాల్సిన తీరు, కొత్త ఓటర్లను చేర్పించడం, లేనివారిని, చిరునామా మారిన వారిని తొలగించడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఏ సమస్య వచ్చినా సూపర్‌వైజర్ల సలహా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎన్నికల అధికారులు, ఏఈఆర్‌వోలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి అందజేత

హైదర్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ దీనబంధు కాలనీకి చెందిన యూసుఫ్‌కు మంజూరైన రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీసీఎం వ్యాన్ బ్రేక్‌డౌన్.. స్తంభించిన ట్రాఫిక్

- ఇబ్బందులుపడిన వాహనదారులు


షాపూర్‌నగర్ చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు


జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో నడిరోడ్డులో నిలిచిపోయిన డీసీఎం

జీడిమెట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్లలో గురువారం సాయంత్రం భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. పోలీస్‌స్టేషన్ సమీపంలో డీసీఎం వ్యాన్ అకస్మాత్తుగా ఆగిపోవడంతో చింతల్ నుంచి సూరారం వరకు భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రధానంగా జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వివిధ ఉత్పత్తులను తరలించే వాహనాలు నిలిచిపోవడంతో పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు పడ్డారు. జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ నర్సింహారావు ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. సూరారం నుంచి వచ్చే వాహనాలను జీడిమెట్ల పారిశ్రామికవాడ మీదుగా పైప్‌లైన్ రోడ్డువైపు మళ్లించారు. నిలిచిపోయిన వాహనాన్ని తరలించి ట్రాఫిక్‌ను నియంత్రించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.


బంగారు పతకం గెలుచుకున్న పూజ నిత్లేకర్‌తో క్రీడాకారులు, కుటుంబసభ్యులు

రెజ్లింగ్ పోటీలో పూజ నిత్లేకర్‌కు బంగారు పతకం

ఎర్రగడ్డ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెజ్లింగ్ కుస్తీ పోటీలో ఎర్రగడ్డకు చెందిన పూజ నిత్లేకర్ బంగారు పతకం సాధించింది. హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ జిల్లా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు సబ్జీమండిలోని వీర్ అభిమన్యు వ్యాయామశాల గంగపుత్ర సంఘంలో జరిగిన అండర్-19 బాలికల విభాగంలో పూజా నిత్లేకర్ ఈ పతకాన్ని సాధించింది. 50 కిలోల విభాగంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన హారిక పైన విజయం సాధించింది. విజేతలకు ఎస్జీఎఫ్ గేమ్స్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కట్ట శ్రీనివాస్ పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా పూజా నిత్లేకర్ కోచ్, తండ్రి చంద్రకాంత్ నిత్లేకర్ మాట్లాడుతూ ఇప్పటికే పూజా నిత్లేకర్ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలను గెలుచుకుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా పూజను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.


ఎర్రగడ్డలో నాకాబందీ నిర్వహిస్తున్న సనత్‌నగర్ పోలీసులు

ఎర్రగడ్డలో పోలీసుల నాకాబందీ

- రూ. 4.10 లక్షల నగదు స్వాధీనం

ఎర్రగడ్డ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఎర్రగడ్డలో నాకాబందీ నిర్వహించారు. డీసీపీ సురేష్ కుమార్, బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో వివిధ పోలీస్‌స్టేషన్‌లకు చెందిన వంద మందికి పైగా పోలీసులు, సాయుధ బలగాల సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. మూడు వాహనాల్లో తరలిస్తున్న రూ. 4.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని పది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులను ప్రశ్నించి, వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు.

ఆ ఘనత మాదే

'రూ.303 కోట్ల పరిహారం సొమ్ము'పై ఎవరికి వారే ప్రచారం ● కంటోన్మెంట్‌లో ప్రధాన పార్టీల పోటాపోటీ


కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

సికింద్రాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ రహదారులపై నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ల కోసం అవసరమైన భూముల సేకరణకు ఇచ్చిన రూ.303 కోట్ల చుట్టూ మరోసారి కంటోన్మెంట్ రాజకీయాలు సాగుతున్నాయి. ఇంత పెద్ద మొత్తం రావడానికి తామే కారణమంటూ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఎవరికివారే ప్రచారం చేసుకుంటున్నారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్ నుంచి తూముకుంట వరకు రాజీవ్ రహదారిపైనా, సుచిత్ర వరకు నాగపూర్ హైవేపైనా ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలని అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ సర్కారు కొలువు దీరింది. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం తప్పనిసరి చేపట్టాల్సి ఉందని, ఇందుకు అవసరమైన భూములు కేటాయించాలని సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. దాంతో కేంద్రం నుంచి సానుకూలత వ్యక్తమైంది. రక్షణ శాఖ, మిలిటరీకి చెందిన భూములను కేటాయించేందుకు సంసిద్ధత తెలిపింది. దాంతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు చెందిన 24 ఎకరాల భూములను కూడా అప్పగించడానికి పచ్చజెండా ఊపింది. అయితే, రక్షణ శాఖ, మిలిటరీకి చెందిన భూములకు బదులుగా నగర శివార్లలో భూములు కేటాయిస్తుండగా, కంటోన్మెంట్ భూములకు పరిహారంగా రూ.303 కోట్లు ఇవ్వడానికి రాష్ట్రం అంగీకరించింది. ఈ మొత్తాన్ని కేంద్రం ఖాతాలో జమ చేయాల్సి ఉండగా కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్(తాజాగా బదిలీ అయ్యారు), అప్పటి నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ తదితరులు చొరవ తీసుకుని కేంద్రం పెద్దలతో సంప్రదింపులు జరిపారు. రూ.303 కోట్లు కేంద్ర ప్రభుత్వ ఖాతాలో జమ కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కంటోన్మెంట్ అభివృద్ధికి వెచ్చించాలని కోరారు. ఇందుకు కేంద్రం అంగీకరించింది. ఇదిలా ఉండగా, ఏకంగా రూ.303 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నందున, ఈ క్రెడిట్ తమదేనంటూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. సాక్షాత్తూ స్థానిక మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సైతం ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ రూ.303 కోట్లు రాష్ట్రం కేటాయించిన నిధులు కావని, కంటోన్మెంట్ భూములు తీసుకున్నందుకు ఇచ్చిన పరిహారమని ప్రకటించారు. అదేవిధంగా, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మోదీ ప్రభుత్వం కారణంగానే ఇది సాధ్యమైందని చెబుతున్నారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపట్టకపోయి ఉంటే భూముల సేకరణ, రూ.303 కోట్ల పరిహారం అంశాలు తెరపైకి వచ్చేవి కావని, గతంలో మల్కాజిగిరి ఎంపీగా పని చేసిన అనుభవం ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చొరవ కారణంగానే ఇది సాధ్యమైందని స్థానిక కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ చెబుతున్నారు. ఇదిలా ఉండగా, రూ.303 కోట్ల రూపాయల విడుదల తమ ఘనతేనంటూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గొప్పలు చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉందంటూ బీఆర్ఎస్ నాయకుడు, బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ తదితర నేతలు విమర్శిస్తున్నారు. రూ.303 కోట్ల మొత్తాన్ని అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిధుల పేరిట కేటాయించలేదని, కంటోన్మెంట్ భూములకు పరిహారంగా చెల్లిస్తున్నదని పేర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయి, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మొత్తం కేటాయిస్తున్నదని తెలిపారు.

విద్యుత్ వైర్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

- రూ.4 లక్షల విలువైన వైర్లు, కారు, బైక్ స్వాధీనం

మియాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనాల్లో విద్యుత్ వైర్లు చోరీ చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.4 లక్షల విలువైన విద్యుత్ వైర్లు, నేరాలకు ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. బీహార్‌కు చెందిన దిలీప్ కుమార్, హఫీజ్‌పేటలో నివాసముంటున్న నిశాల్ కరక్కర్ స్నేహితులు. వీరిద్దరూ జల్సాల కోసం డబ్బు సంపాదించేందుకు దొంగతనాలకు పాల్పడున్నారు. నిందితులు పగటిపూట నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో కారులో వెళ్లి విద్యుత్ వైర్ల బండిళ్లను చోరీ చేసేవారు. నిందితులపై గతంలో అనేక కేసులు నమోదైనట్లు ఏసీపీ తెలిపారు. పలు భవన నిర్మాణదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో నిఘా పెట్టిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.4 లక్షల విలువైన విద్యుత్ వైర్లు, కారు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు ఇవ్వడం లేదని స్నేహితురాలిపై ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యాపారం చేస్తానంటే ఇచ్చిన డబ్బులు అడిగితే తిరిగి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న స్నేహితురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావు నగర్‌లో ఉంటున్న తృప్తి శ్రేయకు స్నేహితురాలు అజ్మీర యామిని వ్యాపారం చేద్దామని ప్రతిపాదన పెట్టింది. వచ్చిన లాభంలో సగం వాటా ఇస్తానని చెప్పి మూడు లక్షలు కావాలని అడగగా ఇచ్చింది. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా క్యూనెట్ పేరుతో తప్పుడు వ్యాపారం చేస్తూ ప్రజల నుంచి అధిక వడ్డీలు గుంజుతున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఇలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకొని, డబ్బులు ఇప్పించాలని కోరింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌లో వ్యభిచారం.. దొరికిన విదేశీ యువతి

బంజారాహిల్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హోటల్ గదిలో వ్యభిచారం జరుగుతుండగా పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో విదేశీ యువతి కూడా దొరికింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10లోని ఓ హోటల్‌లోని మూడు గదుల్లో వ్యభిచారం జరుగుతుందని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే దాడులు నిర్వహించగా, నలుగురు యువతులు, ఏడుగురు విటులు దొరికారు. నిర్వాహకుడు జావీద్‌ఖాన్ అలియాస్ బాబా పరారీలో ఉన్నాడు. ఇదిలా ఉండగా, యువతుల్లో ఒకరు ఉజబేకిస్థాన్ దేశానికి చెందిన పౌరురాలిగా గుర్తించారు. వీరందరిని రెస్క్యూ హోంకు తరలించిన బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

యూసుఫ్‌గూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడపకు చెందిన మనీష శ్రీనగర్ కాలనీలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఈనెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని సోదరుడు వినయ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినీ షూటింగ్ స్పాట్‌గా హెచ్‌ఎంటీ ఫారెస్ట్


నటీ నటులను, సెట్‌లను చూసేందుకు తరలివస్తున్న ప్రజలు


శ్మశాన వాటికలో ఉన్న శివుడి విగ్రహం

కుత్బుల్లాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని హెచ్‌ఎంటీ అటవీ ప్రాంతం సినిమా షూటింగ్‌ల స్పాట్‌గా మారింది. వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతం షూటింగ్‌లకు అనుకూలంగా ఉండడంతో వెబ్ సిరీస్‌లు, ప్రైవేట్ ఆల్బమ్‌లు, చిన్నా, పెద్ద సినిమాలను ఇక్కడే తీస్తున్నారు. తమ అభిమాన నటీ, నటులను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంటోంది. నాలుగు నెలల క్రితం మారేడుమిల్లి పోలీస్ స్టేషన్, బకాసుర రెస్టారెంట్ సినిమాల షూటింగ్ హెచ్‌ఎంటీ ఫారెస్ట్ ప్రాంతంలో జరిగింది. తాజాగా లేడీ ఓరియెంటెడ్ సినిమా షైన షూటింగ్ జరిగింది. గురువారం అర్ధరాత్రి వరకు కొత్త బంగారు లోకం హీరో వరుణ్ సందేశ్, సత్యం రాజేష్ కలయికలో కొత్త సినిమాను శ్మశానవాటిక సెట్‌లో తీశారు. శ్మశానవాటికతో పాటు అక్కడ వేసిన కాటికాపరి గుడిసె, శివుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉండడంతో ప్రజలు చూసేందుకు వస్తున్నారు.


ఆకట్టుకుంటున్న కాటికాపరి గుడిసె


వరుణ్ సందేశ్, సత్యం రాజేష్‌పై పాటను చిత్రీకరిస్తున్న దృశ్యం


షైన సినిమా కోసం హెచ్‌ఎంటీ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన లైట్లు


శ్మశానవాటిక సెట్

ఆ ఘనత మాదే

'రూ.303 కోట్ల పరిహార సొమ్ము'పై ఎవరికి వారే ప్రచారం ● కంటోన్మెంట్‌లో ప్రధాన పార్టీల పోటా పోటీ



సికింద్రాబాద్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ రహదారులపై నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ల కోసం అవసరమైన భూముల సేకరణకు ఇచ్చిన రూ.303 కోట్ల చుట్టూ మరోసారి కంటోన్మెంట్ రాజకీయాలు సాగుతున్నాయి. ఇంత పెద్ద మొత్తం రావడానికి తామే కారణమంటూ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఎవరికివారే ప్రచారం చేసుకుంటున్నారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్ నుంచి తూముకుంట వరకు రాజీవ్ రహదారిపై, సుచిత్ర వరకు నాగపూర్ హైవేపై ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలని అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ సర్కారు కొలువు దీరింది. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం తప్పనిసరి చేపట్టాల్సి ఉందని, ఇందుకు అవసరమైన భూములు కేటాయించాలని సాక్షాత్తూ సీఎం కేంద్ర ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. దాంతో కేంద్రం నుంచి సానుకూలత వ్యక్తమైంది. రక్షణ శాఖ, మిలిటరీకి చెందిన భూములను కేటాయించడానికి సంసిద్ధత తెలిపింది. దాంతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు చెందిన 24 ఎకరాల భూములను కూడా అప్పగించడానికి పచ్చజెండా ఊపింది. అయితే రక్షణశాఖ, మిలిటరీకి చెందిన భూములకు బదులుగా నగర శివార్లలో భూములు కేటాయిస్తుండగా, కంటోన్మెంట్ భూములకు పరిహారంగా రూ.303 కోట్లు ఇవ్వడానికి రాష్ట్రం అంగీకరించింది. ఈ మొత్తాన్ని కేంద్ర ఖాతాలో జమ చేయాల్సి ఉండగా కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్(తాజాగా బదిలీ అయ్యారు), అప్పటి నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ తదితరులు చొరవ తీసుకుని కేంద్రం పెద్దలతో సంప్రదింపులు జరిపారు. రూ.303 కోట్లు కేంద్ర ప్రభుత్వ ఖాతాలో జమ కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ అభివృద్ధికి వెచ్చించాలని కోరారు. ఇందుకు కేంద్రం అంగీకరించింది. ఇదిలా ఉండగా ఏకంగా రూ.303 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నందున, ఈ క్రెడిట్ తమదేనంటూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. సాక్షాత్తూ స్థానిక మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సైతం ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ రూ.303 కోట్లు రాష్ట్రం కేటాయించిన నిధులు కావని, కంటోన్మెంట్ భూములు తీసుకున్నందుకు ఇచ్చిన పరిహారమని ప్రకటించారు. అదేవిధంగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మోదీ ప్రభుత్వం కారణంగానే ఇది సాధ్యమైందని చెబుతున్నారు. కాగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపట్టకపోయి ఉంటే భూముల సేకరణ, రూ.303 కోట్ల పరిహారం అంశాలు తెరపైకి వచ్చేవి కావని, గతంలో మల్కాజిగిరి ఎంపీగా పని చేసిన అనుభవం ఉన్న ప్రస్తుత సీఎం చొరవ కారణంగానే ఇది సాధ్యమైందని స్థానిక కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ చెబుతున్నారు. ఇదిలా ఉండగా 303 కోట్ల రూపాయిల విడుదల తమ ఘనతేనంటూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గొప్పలు చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉందంటూ బీఆర్ఎస్ నాయకుడు, బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ తదితర నేతలు విమర్శిస్తున్నారు.

రూ.303 కోట్ల మొత్తాన్ని అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిధుల పేరిట కేటాయించలేదని, కంటోన్మెంట్ భూములకు పరిహారంగా చెల్లిస్తున్నదని పేర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయి, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మొత్తం కేటాయిస్తున్నదని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఎమ్మెల్యే సమావేశం


రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో చర్చిస్తున్న శ్రీగణేష్

సికింద్రాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ గురువారం సమావేశమయ్యారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన టీపీటీ చార్జీల బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పలు బస్తీల ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి రక్షణశాఖకు సంబంధించిన భూములకు బదులు భూములు ఇచ్చే అంశాన్ని సత్వరమే క్లియర్ చేయాలని ఆయన కోరారు. కాగా త్వరలోనే భూముల బదలాయింపు గురించి తీపి కబురు అందుతుందని రామకృష్ణారావు చెప్పారని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు తాను ప్రధాన కార్యదర్శితో భేటీ అయ్యానని ఆయన తెలియజేశారు.

బాధితుడికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే

మారేడుపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఐదో వార్డ్ పరిధిలోని కాకాగూడ కింది బస్తీవాసుడైన అశోక్ ఇంటిపై బాణాసంచా పడటంతో వారి ఇల్లు, కుటుంబ సభ్యులు ప్రాణాపాయం నుంచి ఎలాంటి ప్రమాదం జరగకుండా బయటపడ్డారు. ఈ విషయం తెలిసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ గురువారం బాధితుని నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. తిరుమలగిరి తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా మాట్లాడి ప్రభుత్వం నుంచి వారికి సహాయం అందేలా చూడాలని చెప్పారు. దీనితో పాటు తాను వ్యక్తిగతంగా కూడా కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని చెప్పారు. నాయకులు సంకి రవీందర్, మురళీ, విష్ణు తదితరులు ఉన్నారు.


తలసానికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న హమాల్‌బస్తీ వాసులు

బొడ్రాయి వార్షికోత్సవానికి ఆహ్వానం

పద్మారావునగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిద్దామని మాజీమంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పద్మారావునగర్ హమాల్‌బస్తీలో 26వ తేదీన నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవానికి హాజరుకావాలని గురువారం ఉదయం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తలసానికి హమాల్‌బస్తీ వాసులు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాల్‌బస్తీలో నిర్వహించే బొడ్రాయి వార్షికోత్సవానికి తనవంతు సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. సుభాష్, సత్యనారాయణ, అంజయ్య, యాదగిరి, కుషాల్, రవి, వెంకట్, సంపత్‌లు పాల్గొన్నారు.

మాలధారణ సన్మార్గంలో నడిపిస్తుంది : తలసాని

బౌద్ధనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి మాలధారణ సన్మార్గంలో నడిపిస్తుందని సనత్‌నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం నామాలగుండులో వీరాంజనేయస్వామి ఆలయం వద్ద అశోక్ గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలకు కాలినడకన వెళ్లే అయ్యప్పస్వాముల యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అంతకముందు ఆలయంలో ఎమ్మెల్యే తలసాని పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పద్మారావునగర్ డివిజన్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, నాయకులు బాలరాజ్‌యాదవ్, శైలేందర్, మిట్టపల్లి బాబురావు, రవీంద్రసాగర్, అజీజ్ పాల్గొన్నారు.

ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ మహా సంప్రోక్షణ


ఆలయ నిర్వాహకులు ఆవిష్కరించిన జీర్ణోద్ధరణ మహాకుంభాభిషేక ఆహ్వాన పత్రిక

బౌద్ధనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో శ్రీగిరి పద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నేటి నుంచి జీర్ణోద్ధరణ పూర్వక మహాకుంభాభిషేక మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, టి.వేణుగోపాలరావులు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జీర్ణోద్ధరణ పూర్వక మహాకుంభాభిషేక మహాసంప్రోక్షణ ఆహ్వానపత్రికను వారు ఆవిష్కరించారు. దేవాలయ పునర్నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత శాస్త్రప్రకారం మహా సంప్రోక్షణ అష్టబంధన మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి నుంచి 30వ తేదీ వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈనెల 31వ తేదీన కంచికామకోటి శంకరాచార్య శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు అభినవోద్దండ విద్యాశంకర భారతి, శ్రీమదష్టాక్షరీ పీఠాధీశ్వరులు త్రిదండి అష్టాక్షరీ సంపతకుమార్ రామానుజ జీయర్‌స్వాములు ప్రత్యేక అతిథులుగా హాజరై జీర్ణోద్ధరణ పూర్వక మహాసంప్రోక్షణ మహాకుంభాభిషేకాన్ని నిర్వహించి ఆలయ సముదాయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.


సంజీవయ్య నగర్‌లోని శ్రీదేవి పోచమ్మ శివలింగేశ్వరస్వామి ఆలయంలో ఆకాశ దీపానికి పూజలు చేస్తున్న జంపన ప్రతాప్

బోయినపల్లిలో కార్తీక పూజలు

బోయినపల్లి, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా బోయినపల్లిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో న్యూ బోయినపల్లి చిన్నతోకట్ట సంజీవయ్యనగర్‌లోని శ్రీదేవి పోచమ్మ శివలింగేశ్వరస్వామి ఆలయంలో శివాభిషేకం, ఆకాశ దీపం పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ కమిటీ అధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో శివాభిషేకం మహా మృత్యుంజయ హోమం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, శివునికి అన్న పూజ, పార్వతీ పరమేశ్వరుల పల్లకి సేవ తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషాచార్యులు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస పూజలు



కార్తీకమాసం పర్వదినాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి గురువారం చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

విద్యుత్‌శాఖ సీఎండీ బస్తీబాట

● అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాల మార్పిడి ● కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగల తొలగింపు


కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, విద్యుత్‌శాఖ అధికారులు

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రధాన రహదారుల్లో విద్యుత్ వ్యవస్థను ఆధునీకరించడంలో భాగంగా పోల్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ చైర్మన్ మానేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. గురువారం సికింద్రాబాద్ సర్కిల్‌లోని ప్యారడైజ్ డివిజన్‌లోని జనరల్ బజార్ సెక్షన్ బస్తీబాటను సరోజిని దేవి రోడ్డులోని బర్తన్ కాంపౌండ్ బస్తీలో నిర్వహించారు. బస్తీబాటలో పాల్గొన్న సీఎండీ బస్తీలో కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేడుతుండడం వంటి పలు సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో భాగంగా కొత్తగా 5 స్తంభాలను ఏర్పాటు చేసి లోడ్ డివైడ్ చేస్తున్నామని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడం వలన పలు ప్రమాదాలు తలెత్తుతున్నాయని, దీనికి తోడు ప్రజలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏర్పాటు చేసిన కాంక్రీట్ ఫౌండేషన్ వద్ద చెత్త వేస్తున్నారని దీనివల్ల షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదాలు పొంచి ఉన్నాయని, వాటిని నివారించడానికి ట్రాన్స్‌ఫార్మర్లు భూమికి 10 అడుగుల ఎత్తుగా పోల్‌పైన ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ బస్తీబాటలో సికింద్రాబాద్ సర్కిల్ ఎస్ఈ గోపయ్య, డీఈ బ్రహ్మానందం, ఎండీ దుర్గాప్రసాద్, ఏఈ కాసం రవి కుమార్‌లతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్‌పీ కోఆర్డినేటర్ వెంకటస్వామి మాదిగ తదితరులు

బౌద్ధనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన దళితుల అత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ) తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ కోరారు. గురువారం పార్శీగుట్ట ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజధానిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై మీద దాడి జరగడమంటే రాజ్యాంగంపై దాడి చేసినట్లేనని, ఎన్నో కేసులు సుమోటోగా స్వీకరిస్తున్న పోలీసులకు ఈ దాడి కనిపించలేదని ప్రశ్నించారు. చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తూ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో నవంబరు 1న లక్షలామంది దళితులతో అత్మగౌరవ ర్యాలీని నిర్వహిస్తున్నామని, దళితులు అధికసంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహరావు, హైదరాబాద్ జిల్లా అధికారప్రతినిధి డప్పు మల్లికార్జున్‌మాదిగ, నాయకులు కె.శివా, జి.రాజశేఖర్, వేణు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలు



వాహన తనిఖీల్లో పట్టుబడిన వారితో ఏసీపీ శంకర్ రాజు, ట్రాఫిక్ పోలీసులు

తిరుమలగిరి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీని గురువారం నిర్వహించారు. రాంగ్ రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. అందులో 149 సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు తిరుమలగిరి ట్రాఫిక్ పీఎస్ లిమిట్స్‌లో కేసులు నమోదు చేశారు. ఎస్ఐలు మారుతి, యుగంధర్ ఆధ్వర్యంలో ఈ రాంగ్ సైడ్ వస్తూ పట్టుబడ్డ వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం కోర్టుకు హాజరపరచగా న్యాయస్థానం జరిమానా విధించింది. నార్త్ జోన్ ఏసీపీ జి.శంకర్ రాజు పట్టుబడిన సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ డ్రైవ్ చేస్తున్న వ్యక్తులకు కౌన్సెలింగ్ చేశారు.

శుభాకాంక్షలు



సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ స్థానంలో బాధ్యతలు స్వీకరించిన అర్వింద్‌కుమార్ ద్వివేదీని కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద కలిసి, బొకేతో శుభాకాంక్షలు తెలిపారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

కేసీఆర్‌కు ఎంఎన్ సన్మానం

ముషీరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : భోలక్‌పూర్ గాంధీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎంఎన్ శ్రీనివాస్‌రావు గురువారం ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునిత ఘన విజయం సాధించేలా ఇంటింటా ప్రచారం చేస్తున్నామని ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమని పేర్కొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు, స్కాలర్స్, విద్యార్థులు

ఓయూ వీసీకి శుభాకాంక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ కుమార్ మొలుగరం బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు విద్యార్థి సంఘాల నాయకులు, స్కాలర్స్ విద్యార్థులు ఆయనను కలిసి బొకే శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, యూనివర్సిటీ అభివృద్ధి కోసం మరిన్ని నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కొమ్ము శేఖర్ మాదిగ, టీఎస్పీ జాక్ ఫౌండర్ వలిగొండ నరసింహ, భీమ్ ఆర్మీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు తీగల శివ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పల్లపు చందు, కాంతి ప్రణయ్ కుమార్, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేదాంత్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులను వేధించడం సరికాదు : ఔటా

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాలతో అధ్యాపకులను వేధించడం సరికాదని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) అధ్యక్షులు ప్రొ. బి.మనోహర్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఓయూ సైన్స్ కాలేజీ కాన్ఫరెన్స్ హాల్లో ఔటా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాన్ టీచింగ్, టీచింగ్, విద్యార్థుల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా ఇటీవల జరిగిన సీఏఎస్ ఇంటర్వ్యూల్లో అవకతవకలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఔటాలో ఉన్న ఓసీ అధ్యాపకులపై ప్రయోగించడం సరైంది కాదని, కేసులను వెంటనే వాపసం తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీ సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణను ఔటా ప్రకటిస్తుందన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్లు నతానియేల్, వెంకటేశ్వర్‌రావు, దాదాపు 100 మందికి పైగా అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్మార్ట్ వర్క్ నేర్చుకోవాలి

● నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కఠిన శ్రమతో పాటు "కొంచెం స్మార్ట్ వర్క్" కూడా నేర్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల (అటోనమస్), ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన గ్రీన్ ఊర్జా టెక్నాలజీస్ అండ్ సిస్టమ్స్ (జీయూటీఎస్) సహకారంతో "సోలార్ పీవీ టెక్నాలజీస్ - ఇన్‌స్టలేషన్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్"పై నాలుగు వారాల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం నవంబర్ 17 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఓయూలో పరిశోధన, ఆవిష్కరణలు, మౌలిక వసతుల బలోపేతానికి విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని, అధ్యాపకులు క్యూ1, క్యూ2 జర్నల్స్‌లో పబ్లికేషన్ చేయడానికి పూర్తి ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. గ్రీన్ ఊర్జా ప్రాజెక్ట్ డైరెక్టర్ అమిత్ కుమార్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. గ్రీన్ ఊర్జా సంస్థ పునరుత్పత్తి శక్తి రంగంలో చేపడుతున్న కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ-విద్యా రంగాల అనుసంధానానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. మంగు, ప్రొ. పి.సతీష్ కుమార్, ప్రొ. ఎన్.శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు, జీయూటీఎస్ సాంకేతిక బృందం పాల్గొన్నారు.


ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సేవా సమాఖ్య సంఘం ప్రతినిధులు

వినతిపత్రం అందజేత

చిలకలగూడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ భవన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని బ్రాహ్మణ సేవా సమాఖ్య సంఘం ప్రతినిధులు మల్కాజగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ని గురువారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్తీక వనసమారాధనలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు కూచి చంద్రశేఖర్, రమేష్, మంగళంపల్లి మురళీ, కె.ఎస్.ఎస్. ప్రసాద్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నానగర్‌లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ అన్నానగర్‌లో గురువారం స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ అధికారులతో కలిసి పర్యటించారు. నాలా పరివాహక ప్రాంతాల్లో నివశిస్తున్న వారికి ఇబ్బందులు కలుగకుండా చిన్న నాలా మరమ్మతులకు రూ.8లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ తెలిపారు. అనంతరం స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, నాయకులు లక్ష్మి, థామస్ తదితరులు పాల్గొన్నారు.


హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ అధికారి చైతన్యకు వినతిపత్రం అందజేస్తున్న రుద్రవీణ మహిళా సంఘం ప్రతినిధులు

ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి : నక్కల శోభ

అడ్డగుట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఫోన్ ద్వారా సర్వే చేసిన వారికి వెంటనే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని రుద్రవీణ మహిళా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభ గురువారం పేర్కొన్నారు. అడ్డగుట్టలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు జీహెచ్ఎంసీ అధికారులు ఫోన్ చేసి సర్వే చేస్తున్నామని చెప్పి వివరాలు సేకరించారన్నారు. కేవలం అడ్డగుట్ట డివిజన్‌లో వందలమంది ఉన్నప్పటికీ శాస్త్రినగర్ బస్తీలో దాదాపు రెండువందల మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో వంద మందికే అధికారులు ఫోన్ చేసి సర్వే చేశారన్నారు. అధికారులు సర్వే చేసిన వారికి వెంటనే ఇళ్లు పంపిణీ చేయాలని జీహెచ్ఎంసీ ఉప కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించామన్నారు. అధికారిని కలిసిన వారిలో సంఘం సభ్యురాళ్లు సంధ్యారాణి, సురేఖ, విజయలక్ష్మి, హసీనా, సునిత, సుజాత, శోభ, కల్పన, సునిత, మాధవి, సుమతి, సువర్ణ రేవతి, రేచల్ నస్రీన్‌లు ఉన్నారు.


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దేవాదాయ కమిషనర్ హరీష్

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

సికింద్రాబాద్, రాంగోపాల్‌పేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానానికి చెందిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను దేవాదాయశాఖ నూతన కమిషనర్ హరీష్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. దేవాదాయశాఖ ఏడీసీ కృష్ణవేణి, డీసీలు కృష్ణప్రసాద్, వినోద్ రెడ్డి, సహాయ కమిషనర్, శ్రీఉజ్జయిని మహాకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు రామతీర్థ శర్మ, వేద పండితులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు ఆర్గానిక్ ప్యాడ్‌లు అందజేస్తున్న శారద

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : నేరెళ్ల శారద

తిరుమలగిరి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద పిలుపునిచ్చారు. గురువారం బొల్లారంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో వివిఆర్ గ్రూప్స్ సమకూర్చిన ఆర్గానిక్ పాడ్‌లను విద్యార్థినిలకు అందజేశారు. చదువుతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వారికి సూచించారు. శరీరంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తల్లులతో చర్చించాలని అన్నారు. తెలుగు ఫిలిమ్ పరిశ్రమ కథానాయిక గీత భాస్కర్, కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొబ్బిలి సురేందర్ రెడ్డి, ఆర్గానిక్ పాడ్స్ స్పాన్సర్ చేసిన వాగ్మికారావు, ఫౌండేషన్ ఫౌండర్ వివిఆర్ గ్రూప్స్ చైర్మన్ వెన్నమనేని విష్ణు రావు సుహాత్ ఫౌండేషన్ హితేష్, శ్రావణి, రమ్య పావని, గర్ల్స్ హైస్కూల్ ప్రిన్సిపల్ సంతోష్ అమ్మగారు తదితరులు పాల్గొన్నారు.